సాక్షి
విజయనగరం
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



కార్మిక బతుకుల్లో కొత్త వెలుగు

పారిశుద్ధ్య కార్మికులు.. ఆరోగ్య సమాజ నిర్మాణానికి పాటుపడే నిరంతర శ్రామికులు. ప్రతిరోజూ వేకువజామునే మేల్కొంటారు. - 6లో



పశువుల శాలలు దగ్ధం

తెర్లాం మండలం టీకటిపేట గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పశువుల శాలలు దగ్ధమయ్యాయి. - 6లో

ఆకట్టుకున్న నఖచిత్రం



గరుగుబిల్లి: మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా గరుగుబిల్లి మండలం నాగూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పళ్ల పరిసినాయుడు శనివారం శ్రీశ్రీ నఖ చిత్రాన్ని గీసి తన అభిమానం చాటుకున్నారు. నఖచిత్రం చూపరులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

పెన్షనర్లకు ఈకేవైసీ తప్పనిసరి

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పెన్షనర్లందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ఖజానా మరియు లెక్కల అధికారి ఆర్‌ఏఎస్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటివరకు లైఫ్‌సర్టిఫికెట్లు సమర్పించని పింఛన్‌దారులు తక్షణమే సంబంధిత ఉపఖజానా అధికారికి సమర్పించాలన్నారు. పెన్షనర్లు తమ సీఎఫ్‌ఎంఎస్ ఐడీ, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సంబంధిత ఉప ఖజానా కార్యాలయ అధికారిని సంప్రదించాలన్నారు. ఇకపై ప్రతి లావాదేవీ కూడా ఆధార్‌తో లింక్ అయిన ఫోన్‌నంబర్‌కే సందేశంరూపంలో వస్తుందన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలకు జిల్లా క్రీడాకారులు పయనం



సీఎంకప్ క్రీడా పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులతో సెట్విజ్‌సీఈఓ

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో తిరుపతి వేదికగా జరగనున్న సీఎం కప్‌క్రీడా పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు శనివారం పయనమయ్యారు. వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకు మొత్తం 14 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తుండగా... జిల్లా తరపున ఆయా క్రీడాంశాల్లో 325 మంది క్రీడాకారులు పాల్గొనున్నట్టు సెట్విజ్ సీఈఓ తెలిపారు. రాజీవ్‌క్రీడామైదానం ప్రాంగణం వద్ద పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు సూచనలు, సలహాలు చేశారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు రూ.8 లక్షల వ్యయంతో క్రీడాదుస్తులతో పాటు టీఏ, డీఏలు అందజేస్తామన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

విజయనగరం ఫూల్‌బాగ్: ఇంటర్మీడిట్ పబ్లిక్ పరీక్షలో ఫెయిలైన విద్యార్థులకు మే 24 నుండి జరగబోయే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రత్యేక శిక్షణ ఇస్తామని డీవీఈఓ ఆర్.సురేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మే 1 నుండి 20 వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మనది చేతల ప్రభుత్వం

- ఉత్తరాంధ్రకు తలమానికంగా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం
- వచ్చేనెల 3న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన
- అదే రోజున చింతపల్లిలో జెట్టీ, టీఆర్‌టీఎస్ ప్రాజెక్టు అభివృద్ధి పనులకు శ్రీకారం
- బృహత్తర కార్యక్రమాన్ని ప్రజాభాగ స్వామ్యంతో విజయవంతం చేద్దాం
- జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అభినందనలు
- టీటీడీ బోర్డు ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి
- పనులు ప్రారంభించిన మూడేళ్లలో విమానం ఎగురుతుంది: మంత్రి బొత్స
- వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నేతలకు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్సీలు, జెడ్పీచైర్మన్, ఎమ్మెల్యేలు

విజయనగరం:

ప్రతిపక్ష నేత చంద్రబాబులా మనది గ్రాఫిక్స్ ప్రభుత్వం కాదని.. ఏదైనా చెబితే చేసి చూపించే చేతల ప్రభుత్వమని టీటీడీ బోర్డు చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ఉద్ఘాటించారు. ఉత్తరాంధ్రపై ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి ఉన్న ప్రత్యేక శ్రద్ధతో రూ.4,500 కోట్ల వ్యయంతో... అన్ని రకాల అనుమతులతో నెల్లిమర్ల నియోజకవర్గంలోని భోగాపురం మండలంలో అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులకు వచ్చేనెల 3న శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడించారు. అదే రోజున రూ.23 కోట్ల ఖర్చుతో చింతపల్లిలో మత్స్యకారుల కోసం ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణంతో పాటు రూ.194 కోట్ల వ్యయంతో తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్టు నుంచి భోగాపురంలో ఎయిర్‌పోర్ట్‌కు ప్రతిరోజు 5 ఎంఎల్‌ఏడీ, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5 లక్షల జనాభాకు ప్రతి రోజు తాగునీటి సరఫరాకు, నెల్లిమర్ల నియోజకవర్గంలోని 24వేల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని చెప్పారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా ఇటీవల శ్రీకాకుళంజిల్లా మూలపేట ప్రాంతంలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. వచ్చేనెల 3న విశాఖ జిల్లా భీమిలిలో 134 ఎకరాల్లో వైజాగ్‌టెక్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తారన్నారు. దీనివల్ల 39వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్రకు తలమానికంగా నిలిచే బృహత్తర కార్యక్రమాలను ప్రారంభించేందుకు వస్తున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికి ప్రజాభాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన ఫూల్‌బాగ్‌లోని జగన్నాథ కల్యాణమండపంలో శనివారం జరిగిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి సుబ్బారెడ్డితో పాటు విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షనేత చంద్రబాబులా ఎన్నికలకు ముందు వరుసగా శంకుస్థాపన చేసి ప్రజలను మోసం చేసే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. దేశంలోనే ప్రప్రథమంగా ఈనెల 7 నుంచి రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. విజయనగరం జిల్లాలో 6.12 లక్షల కుటుంబాలు ఉండగా... 5.33 లక్షల కుటుంబాలతో పార్టీ శ్రేణులు మమేకమై ప్రభుత్వ పాలనను వివరించినట్టు వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, పార్టీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీజీ శంకరరావు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్, విజయనగరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్.బంగారునాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, అంధవరపు సూరిబాబు, నెక్కల నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లలో విమానం ఎగురుతుంది



వచ్చే నెల 3న జరిగే భోగాపురం ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన అనంతరం మూడేళ్లలో మొదటి విమానం ఎగురుతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టే బృహత్తర కార్యక్రమం... ప్రజలు, పార్టీ శ్రేణులు తలెత్తుకుని జీవించేలా ఉంటుంది. జిల్లాకు చెందిన కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు ఫొటోలు తీసి సెల్ఫీ ఛాలెంజ్ చేయడం కాదు. ఎవరి హయాంలో ఎంత శాతం పనులు జరిగాయో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని ఛాలెంజ్‌లు చేయాలి. వచ్చే నెల 9 నుంచి చేపట్టబోయే జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని ఎన్నికలు వచ్చేంత వరకు కొనసాగిస్తాం. ముఖ్యమంత్రి పర్యటనను అందరం కలిసికట్టుగా విజయవంతం చేద్దాం. సమీపంలో ఉన్న నెల్లిమర్ల, విజయనగరం, భీమిలి, చీపురుపల్లి, ఎస్‌కోట, గజపతినగరం నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలి. మూడుగంటల పాటు సాగే ముఖ్యమంత్రి పర్యటనలో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలి. జగన్‌మోహన్‌రెడ్డిని చూద్దామని, ఆయన మాటలు వినదామని ఆశించే వారందరికీ అవకాశం కల్పించండి.

– బొత్స సత్యనారాయణ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి

ఉత్తరాంధ్ర అభివృద్ధి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తరాంధ్ర అభివృద్ధికి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. పారిశ్రామిక అభివృద్ధికి గట్టి పునాది వేశారు. గొప్ప నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అవశ్యకత ఉంది. వచ్చేనెల 3న జరిగే శంకుస్థాపన, బహిరంగ సభలను విజయవంతం చేయడంలో అందరి భాగస్వామ్యం కీలకం.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

గర్వకారణం



విజయనగరం జిల్లాలోని భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పనులు ప్రారంభించి పూర్తిచేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న చర్యలు నిజంగా గర్వకారణం. విమానం ఎక్కే వారితో పాటు.. ఎగురుతున్న విమానం చూసే వారు ఆనందించదగ్గది. విజయనగరానికి ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు చేశారు. గిరిజన యూనివర్సిటీని కేటాయించారు. ప్రజల మనిషిగా సీఎం సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

– కోలగట్ల వీరభద్రస్వామి, ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే

టీడీపీ అబద్ధపు ప్రచారాలు తిప్పికొట్టాలి



భోగాపురం ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపన విషయంలో ప్రతిపక్ష టీడీపీ నేతల అబద్ధపు ప్రచారాలు తిప్పికొట్టాలి. తమ హయాంలో శంకుస్థాపన చేశామని గొప్పలు చెప్పుకుంటున్న వారు పనులు ఎందుకు ప్రారంభించలేకపోయారో ప్రజలకు వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఆలోచిస్తున్న ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. వచ్చేనెల 3న వస్తున్న సీఎంకు నియోజకవర్గంలోని 40వేల మందితో ఘన స్వాగతం పలుకుతాం.

– బడ్డుకొండ అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే

జంట నగరాలుగా విజయనగరం-విశాఖ



భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్-సికింద్రాబాద్ తరహాలో విజయనగరం–విశాఖ జిల్లాలు జంట నగరాలుగా అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాంతం దశ, దిశ మారిపోతుంది. రాష్ట్ర అభివృద్ధిలో విజయనగరం జిల్లా కీలకంగా రూపాంతరం చెందుతుంది. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో విశాఖలో నేవీకి సంబంధించిన ఎయిర్ పోర్ట్ మాత్రమే ఉంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌తో రాబోయే తరాలకు మంచి భవిష్యత్ ఉంటుంది.

– అవంతి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

కల సాకారమయ్యే వేళ..



ఉత్తరాంధ్ర వాసుల కల సాకారమయ్యేందుకు మరికొద్ది రోజులే ఉన్నాయి. సీఎం పాల్గొనే భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిదీ. రూ.4,500 కోట్లతో భోగాపురంలో జీఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.

– మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు



సమావేశానికి హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

గవిడిపేటలో భారీ పేలుడు

- కనకదుర్గ బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం
- తప్పిన భారీ ప్రాణ నష్టం
- అరగంట ముందే ఇళ్లకు వెళ్లిన 300 మంది కార్మికులు
- మంటల్లో చిక్కుకున్న వాచ్‌మన్ మృతి
- బాణసంచా శకలాలు తగిలి వృద్ధురాలి పీకకు గాయం
- భయంతో పరుగులు తీసిన సమీప గ్రామాల ప్రజలు
- రూ.30 లక్షల ఆస్తినష్టం జరిగిందంటున్న యజమాని



కనకదుర్గ ఫైర్‌వర్క్స్‌లో ఎగసిపడుతున్న మంటలు



మృతుడు సీతంనాయుడు (ఫైల్)



గాయాలపాలైన వృద్ధురాలు గవిడి సూరమ్మ



సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న సీఐ సంజీవరావు, ఎస్‌ఐ హరిబాబునాయుడు

చీపురుపల్లి, గుర్ల: సమయం.. శనివారం సాయంత్రం 6 గంటలు.. పొలాల నుంచి రైతులు ఇళ్లకు చేరుకునే వేళ.. గుర్ల మండలం దేవునికణపాక పంచాయతీ పరిధిలోని గవిడిపేటను ఆనుకుని ఉన్న శ్రీ కనకదుర్గ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. పేలుడు శబ్దం పది కిలోమీటర్ల వరకు వినిపించింది. పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందారు. అగ్నికీలలు ఎగసిపడడం, పేలుడు పదార్థాల దాటికి స్థానికులు పరుగు తీశారు. అగ్ని ప్రమాదంలో భారీ ప్రాణ నష్టం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో అదే తయారీ కేంద్రంలో వాచ్‌మన్‌గా పని చేస్తున్న గరివిడి మండలం గెడ్డపువలస గ్రామానికి చెందిన రెల్లి సీతంనాయుడు(66) మంటల్లో చిక్కుకుని మృతి చెందాడు. భారీ పేలుడుతో ఎగసిపడిన బాణసంచా శకలాలు వంద మీటర్ల దూరంలో ఉన్న గవిడిపేట గ్రామంలోని గవిడి సూరమ్మపై పడడంతో మెడకు గాయమైంది. ఆమెను చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. పేలుడు దాటికి స్లాబుతో ఉన్న ఆరు గొడౌన్లు నేలమట్టమయ్యాయి. బాణసంచా తయారీ సామగ్రి, సిద్ధం చేసిన బాణసంచా మొత్తం కాలిబూడిదవ్వడంతో రూ.30 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్టు ఫైర్‌వర్క్స్ యజమాని చంద్రరావు తెలిపారు.

అరగంట ముందు జరిగి ఉంటే...

ఇక్కడ బాణసంచా తయారీ కేంద్రం చాలా కాలంగా నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో పరిసర గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది వరకు పని చేస్తుంటారు. యథావిధిగా శనివారం కూడా 300 మంది కార్మికులు సాయంత్రం 5 గంటల తరువాత విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయిన అరగంట తరువాత అగ్నిప్రమాదం సంభవించింది. అప్పటికి కేంద్రంలో వాచ్‌మన్ రెల్లి సీతంనాయుడు, ఆయన భార్య రెల్లి గున్నలమ్ములు మాత్రమే ఉన్నారు. వాచ్‌మన్ సీతంనాయుడు కేంద్రం లోపల ఉండగా గున్నలమ్మ బయట ఉంది. మంటల వ్యాప్తిని ముందుగా గున్నలమ్మ గమనించింది. భర్త సీతంనాయుడును అప్రమత్తం చేసే లోపే పెద్ద శబ్దంతో మంటలు ఎక్కువకావడంతో ప్రాణ భయంతో సమీపంలోని తోటలోకి పరుగు తీసింది. ప్రమాదం అరగంట ముందు జరిగి ఉంటే ప్రమాదం ఊహించనంత స్థాయిలో ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

సహాయక చర్యల్లో పోలీస్, అగ్నిమాపకశాఖ

ప్రమాద సమాచారాన్ని అందుకున్న పోలీస్, అగ్నిమాపకశాఖ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖాధికారి హేమసుందర్ నేతృత్వంలో సిబ్బంది మంటలను అదుపుచేశారు. చీపురుపల్లి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.సంజీవరావు, గుర్ల ఎస్‌ఐ హరిబాబునాయుడు, పోలీసు సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణలు సహాయక చర్యలు చేపట్టారు. సాయంత్రం 6నుంచి రాత్రి 9 గంటల వరకు మంటలు చెలరేగుతుండడంతో వాచ్‌మన్ మృతదేహాన్ని కనుగొనడం కష్టతరంగా మారింది. మంటలు అదుపులోకి వచ్చాక జేసీబీ సాయంతో భవన శిథిలాలను తొలగించి వాచ్‌మన్ మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రమాద కారణాలు తెలియరాలేదు.

ఆర్‌బీకే యూనిట్‌గా ఈ క్రాప్ నమోదు

- విత్తనాలు, ఎరువుల సరఫరా పర్యవేక్షణకు టాస్క్ ఫోర్సు
- ఏఏబీ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- తోటపల్లి నుంచి జూన్ మొదటివారంలో నీరు విడుదల: జెడ్పీ చైర్మన్



పట్టు పరిశ్రమ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి, జెడ్పీ చైర్మన్, కలెక్టర్, జేసీ తదితరులు

విజయనగరం అర్బన్: రైతులు సాగుచేస్తున్న భూమిని వర్గీకరిస్తూ కోర్టు కేసులు ఉన్నవి మినహా మిగిలినవన్నీ ఈ క్రాప్ నమోదు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఇనామ్, దేవదాయ, డీ పట్టా భూముల్లో సాగుచేసిన పంటల వివరాలు కూడా నమోదు చేయాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు గ్రామాల సరిహద్దుల్లో ఉన్న భూముల ఈ–క్రాప్ చేయవలసి వస్తే సచివాలయ పరిధిని కాకుండా ఆర్‌బీకే పరిధిని పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. ఆర్‌బీఏ పరిధిలో చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లోనే జరగాలని తెలిపారు. సీజన్ ప్రారంభానికి ముందే ఎరువులు, విత్తనాలు సక్రమంగా పంపిణీ జరిగేలా ప్రత్యేక టాస్క్‌ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మికు సూచించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జలాశయాల్లో ఉన్న నీటి నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తోటపల్లి వద్ద ప్రస్తుతం 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని ఈఈ రెడ్డి రామచంద్రరావు వివరించారు. ఆంధ్ర, తాటిపూడిలో కూడా 50 శాతం నీటి నిల్వలు ఉన్నట్టు వెల్లడించారు. జూన్ మొదటి వారంలో నీటిని విడుదల చేసేందుకు సిద్ధంగా ఉండాలని చైర్మన్ ఆదేశించారు. చివరి భూములకు నీరు అందడం ఆలస్యం కాకూడదని, నీటి విడుదలకు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంకావాలన్నారు. అనంతరం పట్టు పరిశ్రమశాఖ ముద్రించిన 'పట్టుని పెంచుదాం' పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు డాక్టర్ సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపుభావన, జేసీ మయూర్ అశోక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి తారక రామారావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, మార్క్‌ఫెడ్ డీఏ విమల, ఏఏబీ సభ్యులు, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

5 నుంచి జాతీయ స్థాయి స్పోర్ట్స్ డ్యాన్స్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కొత్తవలస : ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ డ్యాన్స్ అసోషియేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మే 5నుంచి 7 వరకు విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని మిరాకల్ ఎడ్యుకేషనల్ సొసైటీ వద్ద జాతీయ స్థాయి స్పోర్ట్స్ డ్యాన్స్ చాంపియన్ పోటీలను నిర్వహించనున్నట్టు చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ పి.రుకమాకారావు తెలిపారు. ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో ఈ పోటీలు జరగనున్నట్టు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కొత్తవలసలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి ఎ.ప్రకాష్, ప్రముఖ న్యాయవాది గొడుగుల మహేంద్ర, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీ తిరగబడి ఇద్దరికి గాయాలు



108లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

రేగిడి : మండలంలోని కోడిశ గ్రామ సమీపంలో శనివారం రాళ్లతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి పలువురికి గాయాలయ్యాయి. అంబకండి గ్రామానికి చెందిన ఎస్.అచ్చుతరావు, పాలవలస అప్పలనాయుడులకు ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా, అటువైపుగా వెళ్తున్న తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి బాధితులను 108 వాహనంలో రాజాం ఆస్పత్రికి తరలించారు. ఈఎంటీ ఈశ్వరరావు ప్రాథమిక చికిత్స చేశారు.

పశువుల శాలలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పశువుల శాలలు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు సంభవించిన అగ్ని ప్రమాదంలో చీకటి చంద్రరావు, సింహాచలం, చిన్నంనాయుడులకు సంబంధించిన మూడు పశువుల శాలలు కాలిపోయాయి. పశువుల శాలలు కాలిపోతున్న సమయంలో పశువులు శాలలో లేకపోవడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదు. పశువుల శాలల పక్కనే షెడ్‌లో ఉన్న కారు పాక్షికంగా దెబ్బతింది. సమాచారం రాజాంలోని అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు తెలియజేయడంతో వెంటనే అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది శకటంతో వచ్చి మంటలు అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.60వేలు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశామని వీఆర్‌ఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తెలిపారు.

స్నేహితుల దాడి



చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

పార్వతీపురం: తను ప్రేమించిన వ్యక్తితో స్నేహితుడు చనువుగా ఉండటాన్ని ప్రశ్నించినందుకు దాడి చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావు తను ప్రేమించిన అమ్మాయితో స్నేహితుడు వాసు చనువుగా ఉండటాన్ని ప్రశ్నించినందుకు వాసుతో పాటు మరికొందరు గాయపరిచారు. ఈ మేరకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,930-00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,850-00
వెండి (కిలో)	80,400-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224

కార్మిక బతుకుల్లో కొత్త వెలుగు



నాడు:

చాలీచాలని జీతాలు.. అవికూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి... పనికి సెలవుపెడితే ప్రజల ఆరోగ్యానికి చేటు.. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించినా పనికి తగ్గ వేతనం లేని దుస్థితి.. చెత్త తరలింపునకు వాహనాలు అరకొరే. ఇదీ నాలుగేళ్ల కిందటి వరకు పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొనే సమస్యలు.

నేడు:

పాలన మారింది. ప్రజల ప్రభుత్వం అధికారంలో ఉంది. బడుగు బలహీన వర్గాలు, కార్మికుల మేలు కోరే నాయకుడు పాలనా పగ్గాలు చేపట్టడంతో కార్మికుల బతుకుల్లో కొత్త వెలుగు కనిపిస్తోంది. పారిశుద్ధ్య కార్మికుల నెల వేతనం రూ.12వేల నుంచి రూ.21 వేలకు పెరిగింది. ప్రతీనెలా ఒకటో తేదీనే చేతికి అందుతోంది. ప్రతీ కార్మికునికి ఏడాదికి మూడు జతల యూనిఫారాలు, 12 సబ్బులు, నాలుగున్నర లీటర్ల కొబ్బరి నూనె పంపిణీ చేస్తున్నారు. తడి, పొడి చెత్త తరంపునకు ప్రత్యేక వాహనాల కేటాయించడంతో కార్మికుల పని సులభతరమైంది. చెత్త తరలింపు వేగవంతంగా సాగుతోంది. ప్రతీ పట్టణం పరిశుభ్రంగా కనిపిస్తోంది.

- ఠంచన్‌గా జీతాల చెల్లింపు
- పెరిగిన హెల్త్ అలవెన్స్
- చెత్త తరలింపునకు ప్రత్యేక వాహనాలు
- సులభమైన చెత్త సేకరణ
- ప్రభుత్వ చర్యలతో మారిన కార్మికుల బతుకులు



పాలకొండలో సేకరించిన చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

విజయనగరం డెస్క్: పారిశుద్ధ్య కార్మికులు.. ఆరోగ్య సమాజ నిర్మాణానికి పాటుపడే నిరంతర శ్రామికులు. ప్రతిరోజూ వేకువజామునే మేల్కొంటారు. జనసంచారం ఆరంభమయ్యే సరికి పట్టణాలను పరిశుభ్రం చేస్తారు. షిఫ్టుల వారీగా పరిశుభ్రతలో మమేకమవుతారు. నాలుగేళ్ల కిందటి వరకు వీరి బతుకులు అగమ్యగోచరం. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొచ్చేవారు. కష్టం వస్తే ఆదుకునేవారే కరువయ్యే దీనస్థితి. ఆ దశలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో వారి బతుకులకు వెలుగుదారి కనిపించింది. జీతాలు పెరిగాయి. అలవెన్స్ పెరిగింది. యూనిఫారాలు, సబ్బులు, ఆయిల్ ఠంచన్‌గా అందుతున్నాయి. వారి కుటుంబాల్లో జీవన ఉన్నతి స్పష్టంగా కనిపిస్తోంది. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా కొత్తవాహనాలను ప్రభుత్వం సమకూర్చడంతో కార్మికుల పని కూడా సులభతరమైంది. విజయనగరం ఉమ్మడి జిల్లాలోని ప్రతీ పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్మికలోకం ముందుకు సాగుతోంది.

వారి విధులకు 'క్లాప్స్' కొట్టాల్సిందే..

అధికారుల ఆదేశాల మేరకు పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరిస్తున్నారు. విజయనగరం కార్పొరేషన్‌తో పాటు బొబ్బిలి, పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలు, పాలకొండ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీలకు ప్రభుత్వం సమకూర్చిన కొత్తవాహనాలపై చెత్తను తరలిస్తున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లు, కంపాక్టర్, టిప్పర్లతో పాటు వందలాది ట్రాలీబళ్లను ప్రభుత్వం కేటాయించడంతో చకచకా పనిపూర్తవుతోందని కార్మికులు చెబుతున్నారు.

మాకు మంచి రోజులొచ్చాయి..



నా పేరు తుపాకుల జాన్. పార్వతీపురం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికునిగా 15 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాను. గతంలో జీతం ఎప్పుడు అందుతుందో తెలిసేది కాదు. నాలుగేళ్లుగా ప్రతినెలా ఒకటో తేదీనే చేతికి రూ.21వేలు అందుతోంది. మా బతుకులు మారాయి. ఆర్థిక ఊరట కలిగింది. పిల్లలను మంచిగా చదివించుకుంటున్నాం.



పార్వతీపురం పట్టణంలో ఇంటింటి చెత్తసేకరణలో నిమగ్నమైన పారిశుద్ధ్య కార్మికుడు

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పట్టణాల్లో పారిశుద్ధ్య పనిలో నిమగ్నమైన కార్మికులు, వాహనాల సంఖ్య ఇలా...		
పట్టణం/ నగరపంచాయతీ	కార్మికులు	మొత్తం వాహనాల సంఖ్య
విజయనగరం	633	94
బొబ్బిలి	146	8
రాజాం	65	5
నెల్లిమర్ల	41	4
పార్వతీపురం	126	20
పాలకొండ:	63	4
సాలూరు:	122	5

ఇప్పుడు బాగుందయ్యా..



కార్మికురాలిగా ప్రతిరోజూ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తున్నాను. ఏళ్లతరబడి పనిచేస్తున్నా మా బాగోగులను ఎవరూ పట్టించుకోలేదు. నాలుగేళ్లుగా మా బతుకులు బాగున్నావయ్యా. జీతాలు సరిగ్గా అందుతున్నాయి. మాకు అధికారులు అన్నివిధాలుగా తోడుగా ఉంటున్నారు. జీవితానికి భరోసా దొరికింది. సంతోషంగా బతుకుతున్నాం. మాకు ఇది చాలు.

– నీలాపు దుర్గమ్మ, పారిశుద్ధ్యకార్మికురాలు, విజయనగరం

ఒకటో తేదీనే జీతాల చెల్లింపు



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పారిశుద్ధ్య కార్మికులకు మేలు జరిగింది. గత ప్రభుత్వ హయాంలో మా హక్కుల కోసం పోరాటాలు చేసే పరిస్థితి ఉంటే... ప్రస్తుత ప్రభుత్వ పాలనలో గడిచిన నాలుగేళ్లలో ఒక్కసారి ఆ అవసరం రాలేదు. సీఎం ఇచ్చిన మాటప్రకారం రూ.6వేల హెల్త్ అలెవెన్స్‌లు మంజూరు చేశారు. దీంతో మా వేతనం రూ.21వేలకు చేరింది. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నారు. కార్మికులకు అవసరమైన నూనెలు, సబ్బులు, చెప్పులు సకాలంలో అందజేయడం కార్మికులంతా 'చెత్త' శుద్ధితో విధులు నిర్వర్తిస్తున్నారు.

– జలగడుగుల కామేష్, రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికుడు, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్

అన్ని వసతులు సమకూరుస్తున్నాం.



ఎంతో కష్టపడి పట్టణాన్ని పరిశుభ్ర పరిచే పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని వసతులు సమకూరుస్తున్నాం. గతంతో పోల్చుకుంటే వేతనాలు బాగా పెరిగాయి. దీంతో వారికి ఆర్థికంగా ఉపయోగపడుతుంది. ప్రతీ నెల వారికి శానిటేషన్ సామగ్రిని క్రమం తప్పకుండా అందజేస్తున్నాం.

– మురళీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం

పోలీసుల అదుపులో ఆటోల్లో చోరీకి పాల్పడుతున్న మహిళలు



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఆటోల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు టూటౌన్ సీఐ సిహెచ్.లక్ష్మణరావు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. సాలూరుకి చెందిన బంధపు కూర్మారావు ఈ నెల 28న సాలూరు నుంచి విజయనగరం ఆర్టీసీ బస్సులో వచ్చి కాంప్లెక్స్ వద్ద ఆటో ఎక్కి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వద్ద దిగి తన భార్య హ్యాండ్ బ్యాగ్ చూడగా అందులో రూ. 37,500 పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కొత్తవలస 202 కాలనీకి చెందిన పాతనేరస్తుల ఫొటోలను బాధితులకు చూపించగా అందులో ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. దీంతో స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద గంటా కాశేశ్వరి, మేకల రేవతి, ఆవుల పార్వతిలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 37,500 నగదు రికవరీ చేశామన్నారు. కేసు చేధించడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్ఐ పైడితల్లి, హెచ్‌సీ ప్రసాద్, పీసీ వాసును సీఐ అభినందించారు.

యువకుడు బలవన్మరణం



వెంకటరమణ మృతదేహం

వీరఘట్టం: మండలంలోని మహదేవివలసకు చెందిన జన్ని వెంకటరమణ (17) శనివారం గ్రామ శివారు తోటలో ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వెంకటరమణ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడని, ఆరోగ్యం కుదుటపడక పోవడంతో మనస్తాపం చెంది ఉరి వేసుకుని చనిపోయినట్లు అతని తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిషోరవర్మ తెలిపారు.

తూర్పుగోదావరి జిల్లా వాసి హత్య!



వెంకటరమణ మృతదేహం



ఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: మండలంలోని రావివలస పంచాయతీ పంతెమామిడివలసకు వెళ్లే దారిలో సీత గుండమ్మ గుడి వద్ద ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మూడు రోజుల కిందట ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు హత్య చేసి సీత గుండమ్మ గుడి సమీపంలో పడేశారు. శనివారం అటువైపుగా వెళ్లిన స్థానికులకు మృతదేహం కనపడడంతో వారు రావివలస సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. సచివాలయ సిబ్బంది స్థానిక ఎస్ఐ సురేంద్రనాయుడుకు సమాచారం ఇచ్చారు. దాంతో సీఐ తిరుమలరావు ఎస్ఐ, పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుని జేబులో ఉన్న ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఆధారంగా ఆ వ్యక్తి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చెంపేటకు చెందిన సాగి వెంకటరమణ(35)గా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు మృతుని తలపై పెద్ద బండరాయితో మోది హత్య చేసినట్టు ఆనవాళ్లు ఉన్నాయని, ఇది హత్యేనన్న అనుమానం వ్యక్తం చేస్తూ ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన వ్యక్తి వడ్డీ వ్యాపారం చేస్తుంటాడని కుటుంబ సభ్యులు తెలపడంతో ఇక్కడకు ఎందుకు వచ్చాడు, ఎలా మృతి చెందాడు, హత్య చేయబడితే ఏ కారణంతో హత్య చేశారు? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది నెలల క్రితం భార్యతో విడాకులు తీసుకున్నాడు. అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని చిన బోగిలి రైల్వే గేట్ సమీపంలో శనివారం ఉదయం గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం.. మృతుడు పార్వతీపురం మండలం లచ్చిరాజుపేట గ్రామానికి చెందిన శెట్టి శంకరరావుగా గుర్తించినట్లు తెలిపారు.

ఫినాయిల్ తాగి ఆత్మహత్యా యత్నం

పార్వతీపురం: పెద్ద చదువులు చదివి ఏ ఉద్యోగం లేకపోవడంతో ఇంట్లో తల్లిదండ్రుల అనే మాటలకు మనస్తాపానికి గురై ఓ యువకుడు ఫినాయిల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.... మక్కువ మండల కేంద్రానికి చెందిన సీహెచ్ మహేష్ ఎంఎస్సీ చదివాడు. ఎక్కడా ఉద్యోగం చేయకుండా ఇంట్లో ఖాళీగా ఉంటున్నాడు. తల్లిదండ్రులు ఏదో కంపెనీలో ఉద్యోగం చేయమని ఎంత చెప్పినా వినడం లేదు. తల్లిదండ్రుల ఒత్తిడి తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేష్ ఫినాయిల్‌ను తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి తల్లిదండ్రులకు సమాచారాన్ని ఇవ్వడంతో 108 అంబులెన్స్ ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

అండర్ - 23 వన్డే టోర్నీ విజేత విజయనగరం



అండర్ 23 నార్త్ జోన్ వన్డే టోర్నీ విజేత విజయనగరం జట్టు

విజయనగరం/విజయనగరం రూరల్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ – 23 నార్త్ జోన్ క్రికెట్ వన్డే టోర్నీ విజేతగా విజయనగరం జట్టు నిలిచింది. జిల్లా కేంద్రంలోని సర్ విజ్జి స్టేడియంలో ఈ నెల 26 నుంచి అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ టోర్నీ ప్రారంభం కాగా శనివారంతో ముగిసింది. ఆఖరి రోజు శనివారం విజయనగరం – తూర్పుగోదావరి జట్ల మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో విజయనగరం జట్టు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తూర్పుగోదావరి జట్టును విజయనగరం బౌలర్లు కట్టడి చేశారు. దీంతో తూర్పుగోదావరి జట్టు 48.2 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌవుట్ అయింది. విజయనగరం జట్టు బౌలర్‌లలో లెగ్ స్పిన్నర్ దీపు భార్గవ్ తన 10 ఓవర్లలో 35 పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. జట్టు కెప్టెన్ జై దుర్గాకుమార్ 9 ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు సంపాదించారు. తూర్పుగోదావరి జట్టు బ్యాటర్లలో ఓపెనింగ్ బ్యాటర్ జె.సూర్య 26 పరుగులు చేయగా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కేఎస్ఎస్ జయంత్ 23 పరుగులు మాత్రమే సాధించారు. అనంతరం 155 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన విజయనగరం జట్టు 36.1 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్ ఎం.అభిలాష్ అర్ధ సెంచరీతో (106 బంతుల్లో 57 పరుగులు, నాటౌట్) రాణించగా, మరో ఓపెనర్ సాయి సందీప్ 30 పరుగులు, ఫస్ట్ డౌన్‌లో వచ్చిన జీఎస్పీ తేజ 32 పరుగులు, ఎం.రవికిరణ్ 21 పరుగులు చేసి నాటౌట్‌గా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ టోర్నీలో శ్రీకాకుళం, తూర్పుగోదావరి జట్లపై వరుస విజయాలతో 8 పాయింట్లు సాధించిన విజయనగరం జట్టుకు, విశాఖపట్నం జట్టుతో జరిగిన మ్యాచ్ వర్షంతో నిలిచిపోవడంతో 2 పాయింట్లు దక్కాయి. దీంతో విజయనగరం జట్టుకు 10 పాయింట్లు లభించాయి. విశాఖ జట్టు రెండు విజయాలు ఒక మ్యాచ్ రద్దుతో పది పాయింట్లు దక్కాయి. అయితే నెట్ రన్ రేట్‌లో విజయనగరం జట్టు మెరుగ్గా ఉండటంతో పాయింట్లు పట్టికలో అగ్రస్థానం లభించింది. టోర్నీ ఆసాంతం రాణించి, విజేతగా నిలిచిన విజయనగరం జట్టు ఆటగాళ్లను, కోచ్‌లు చంద్రశేఖర్ చందక రమేష్‌లను విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్ఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలక్టర్లు బంగారాజు, వర్మ, సర్పరాజులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక



నీరజను అభినందిస్తున్న పీడీ కృష్ణంరాజు

కొత్తవలస : తిరుపతిలో మే 1వ నుంచి 5వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తవలస మండలం దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి విరోతి నీరజ, ఎల్.కోట మండలం గంగుబూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని చిప్పాడ సాయిలలిత ఎంపికైనట్లు దెందేరు హైస్కూల్ పీడీ యు.కృష్ణంరాజు శనివారం తెలిపారు. వీరు విజయనగరం జిల్లా జట్టు తరపున ఆడుతారన్నారు. వీరిని కొత్తవలస వాలీబాల్ అసోషియేషన్ క్లబ్ కార్యదర్శి గొరపల్లి శివ, సభ్యులు మహేంద్ర, సీనియర్ క్రీడాకారులు బాలకృష్ణ, రాజునాయుడు, శ్రీను అభినందనలు తెలిపారు.